క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుధ్య పనులు పరిశీలించండి

నింద్ర: వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుధ్య పనులను చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి ధరణి అన్నారు. మండలంలోని శ్రీరామాపురంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామాల్లో తాగునీరు సరఫరా చేసే ఓవర్ హెడ్ ట్యాంకులు ప్రతి 15 రోజులకోసారి శుభ్రం చేయాలని అన్నారు. ట్యాంకులో నీటిని నింపిన ప్రతిసారి క్లోరినేషన్ చేసిన తరువాతే నీరు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీపై సమీక్ష


మాట్లాడుతున్న తహసీల్దార్ అరుణ కుమారి

పాలసముద్రం: మండల పరిధిలోని చౌక దుకాణంలో డీలర్లు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర సరుకులను సక్రమంగా అందించాలని తహసీల్దార్ అరుణ కుమారి తెలిపారు. బుధవారం ఆమె తన కార్యాలయంలో డీలర్లతో సమీక్ష నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్‌కార్డుదారులకు నిత్యావసర సరుకులు అందించేలా కృషి చేయాలని తెలిపారు. ముఖ్యంగా ప్రతి చౌక దుకాణం ఎదుట నిత్యావసర సరుకుల ధరల పట్టిక, తాగునీటి సౌకర్యం ఉండాలని సూచించారు. 15వ తేదీ వరకు షాపులో డీలర్లు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ రిషివర్మ, నరసింహన్, డీలర్లు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీపై ప్రత్యేక శ్రద్ధ


చెత్త సేకరణ కేంద్రంలో వానపాము ఎరువును పరిశీలిస్తున్న ఎంపీడీఓ సతీష్

పాలసముద్రం: గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పంచాయతీకి ఆదాయం పెంచుకోవాలని ఎంపీడీఓ సతీష్ తెలిపారు. బుధవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ పరిధిలోని చెత్త సేకరణ కేంద్రాన్ని ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సతీష్ మాట్లాడుతూ చెత్త సేకరణతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తీరడంతో పాటు చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు. గ్రీన్‌అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను అభివృద్ధి చేయాలన్నారు. తయారైన ఎరువును రైతులకు తక్కువ ధరకు కేజీల ప్రకారం విక్రయించాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

అలరించిన అర్జున తపస్మాన్

పూతలపట్టు(యాదమరి): మండల పరిధిలోని పోటుకనుమలో జరుగుతున్న మహాభారత ఉత్సవాలు విశేషంగా జరుగుతున్నాయి. అర్జున తపస్మాన్ కార్యక్రమం బుధవారం భక్తులను అలరించింది. ఇంద్ర సుతుడు అర్జునుడు శివుడిని మెప్పించి పాశుపతాస్త్రం పొందే క్రమంలో అర్జున వేషధారి పాడిన పద్యాలు, పాటలు భక్తులను ఎంతగానో మెప్పించాయి. అర్జునుడిగా తారక్, శివునిగా త్యాగ, పార్వతిగా ధనలక్ష్మి నటన ప్రేక్షకులను రంజింపజేసింది. సంతానం లేని మహిళలు తపస్మాన్ వద్ద ఒరపడ్డారు. దీనికి భానుమూర్తి నాయుడు కుటుంబం ఉభయదారుగా వ్యవహరించింది. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం రాత్రి శ్రీ వేంకటేశ్వర నాటక కళామండలి కిరణ్ బృందం వారిచే గయోపాఖ్యానం నాటకాన్ని భక్తులను ఆకట్టుకునేలా ప్రదర్శించారు.

పంట మార్పిడి.. అధిక దిగుబడి

- చీడపీడలు దూరం


తిరుమళరాజుపురంలో వంగతోటల తర్వాత సాగు చేసిన బంతి పూలతోట

పాలసముద్రం: మండలంలోని పంటల మార్పిడి చేస్తే తెగుళ్లు నివారించి.నగరి డివిజన్ ఏడీఏ రుద్రరాజ రమేష్,పాలసముద్రం వ్యవసాయాధికారి డిల్లీప్రసాద్ పేర్కొన్నారు.తర్వాత తెరువు పురుగుమం దుల ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు.ప్రస్తుత పంటల స్థానంలో ఏయే పంటలను సాగు చేసుకోవచ్చో వాటి వల్ల లాభాలేమిటో వారు మాటల్లో వివరించారు.

ఎప్పుడు ఒకే రకమైన పంటలు సాగు చేయడం మంచిదికాదు.దీని వల్ల చీడపీడలు వృద్ధి చెందుతాయి.ఒక పంట వేసిన తరువాత వేరే పంటను సాగు చేయడం వల్ల రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.కొన్ని పంటలకు తెగుళ్లు.పురుగులు ఎక్కువగా ఆశిస్తుంటాయి. చీడపీడలు ఆశించిన పంటను ఎంచుకుని సాగు చేసుకుంటే అధిక లాభం సాధించవచ్చు.

పంట మార్పిడి ఎలా చేసుకోవాలంటే...

- ప్రస్తుతం మెట్టలో వరికోతలు ప్రారంభమయ్యాయి.రాసున్న రబీ సీజన్‌లో నీటి తడులతో ఇబ్బంది కలిగే అవకాశముంది.అందువల్ల వరికి ప్రత్యామ్నాయంగా పెసలు,వేరుశెనగ వంటి నూనె గింజలు వేసుకోవడం మంచిది.
- అరటిలో ఎక్కువగా బ్యాక్టీరియా,దుంపకుళ్లు తెగుళ్లు ఆశిస్తున్న నులల్లో వరి,చెరకు వంటి పంటలను సాగు చేసి పంట మార్పులు చేసుకోవాలి.
- తమలపాకు తోటల్లో ఎండుతెగుళ్లు,మొదలు కుళ్లు తెగులు వ్యాపించినప్పుడు కనీసం మూడేళ్లకు ఒకసారి మొక్కజొన్న వంటి పంటలను సాగు చేసుకోవచ్చు.
- వంగ పంటలో ఆశించే ఎండుతెగులుకు నివారణ కష్ట.దీంతో ఈ తెగులు సోకిన నేలలో కాలీఫ్లవర్ వేసుకుంటే మంచిది.వంగలో నులిపురుగులు ఎక్కువగా ఉంటే తరువాత బంతిపూలు వేసుకోవాలి.
- టమాటలో ఎండు తెగులు ఆశిస్తే ఫ్రెంచి చిక్కుడు సాగు చేస్తే ఆ తెగులు తగ్గుతుంది.
- కూరగాయలు,తీగజాతి కూరల తెగుళ్ల నివారణకు వరిపంట సాగుతో పంట మార్పిడి చేసుకోవాలి.
- మిరప, టమాట,వేరుశెనగ,కాలీఫ్లవర్ వంటి పంటలకు ఆశించే లద్దె పురుగు నివారణకు ఆ పంట పూర్తయ్యాక,సజ్జ,జొన్న,వరి,గారి,పొద్దు తిరుగుడు తది తర ఆరుతడి పంటలతో పంటమార్పిడి చేసుకోవాలి.అలాగే బంతిపూల,ఆవాలు వంటి పైర్లను సాగు చేస్తే ఆకు ముడత తెగులను పారదోల వచ్చు.
- పసుపు పండించిన తరువాత వరి,జొన్న సాగు చేస్తేనులిపురుగుల నుంచి తప్పుకోవచ్చు.

ఒకే కుటుంబ పంటలు సాగు చేయవద్దు=పంటల సాగు తరచూ మారుస్తూండాలి.ఒకే కుటుంబానికి చెందిన పంటలను వేయడం వల్ల పంటలకు సోకిన తెగళ్లు.చీడపీడలు భూమిలో అలాగే ఉండిపోయి.తిరిగి పంట సాగు చేసిన సమయంలో ఆ పంటకు తప్పుకుండా తెగళ్లు.చీడపీడలు ఆశిస్తాయి.ఉదాహరనకు టమాట,వంగ,మిరప,బెండ పంటలు ఒకే కుటుంబానికి చెందినవి.ఇవి ఒక దాని తరువాత ఒకటి వేయడం వల్ల గత పంటకు ఉన్న తెగుళ్లు మరొక పంటకు సోకుతాయి.కావున తరచూ పంటల మార్పిడి తప్పనిసరిగా చేయాలి.లేకుంటే పలు సమస్యలు తలెత్తుతాయి.పంటల మార్పిడి చేసుకుంటూ ఉంటే రైతుల ఖర్చులు తగ్గుతాయి. అలాగే ఆదాయం పెరుగుతుంది.


రైతు సాగు చేసిన మొక్కజొన్న పంట


కూరగాయలు సాగుచేసిన తర్వాత పండించిన వరి


రైతు సాగు చేసిన చిక్కుడు, బెండ పంటలు

సస్యరక్షణ చర్యలు చేపట్టండి

నింద్ర: ఖరీఫ్‌లో వరి సాగు చేసిన పంటలకు ఆశించే చీడపీడలను నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. మండలంలోని అగరం, నింద్ర గ్రామాల్లో బుధవారం వరి పంటలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు సస్యరక్షణ తప్పనిసరిగా పిచికారీ చేయాలని కోరారు. వరిలో లద్దిపురుగుల నివారణ చర్యలు చేపట్టాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ


శ్రీనివాసులు

గంగాధర నెల్లూరు: మండల తహసీల్దారుగా శ్రీనివాసులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తహసీల్దార్ ఉన్న చంద్రశేఖర్ పదవీ విరమణ పొందగా, డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న తులసీరామ్ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. చిత్తూరు ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులును జీడీ నెల్లూరు తహసీల్దారుగా నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మండల రెవెన్యూ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

రైతులను ఆదుకోకపోతే ఉద్యమాలు చేస్తాం

గంగాధర నెల్లూరు: జిల్లాలో మామిడి రైతులను రాష్ట్రప్రభుత్వం ఆదుకోవాలని బీసీవై పార్టీ అధినేత రామచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. గంగాధరనెల్లూరు మండల కేంద్రంలో జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ వద్ద బుధవారం ఆయన చేరుకుని మామిడి రైతులకు సంఘీభావంగా నిరసన తెలిపారు. ట్రాక్టర్లతో కిలోమీటర్ల మేర అమ్మకానికి వేచి చూస్తున్న రైతులకు ఫ్యాక్టరీ యాజమాన్యాలు ప్రభుత్వం మొండి చేయి చూపుతోందన్నారు. మామిడి రైతులను ఆదుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా రైతు ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం మామిడి రైతు ట్రాక్టర్ల డ్రైవర్లకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఎన్నికల హామీలు నెరవేర్చండి


మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికుల ఆందోళన

పుత్తూరు: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామంటూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబునాయుడు నెరవేర్చాలని సమాచార హక్కుల వేదిక కార్యదర్శి కె.మురగారెడ్డి డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ నాయకుడు మునెయ్య ఆధ్వర్యంలో బుధవారం రెండవ రోజు సమ్మె కొనసాగింది. ఈ సమ్మెకు స్థానిక సమాచార హక్కుల వేదిక సభ్యులు సంఘీభావం తెలిపారు. మురగారెడ్డి మాట్లాడుతూ ప్రతి సమస్యపై ప్రశ్నిస్తా అంటూ ఎగిరెగిరి పడిన డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు కనిపించడం లేదా అంటూ ప్రశ్నించారు. గత ఏడాదిగా సమస్యలు పరిష్కరించాలని కార్మికులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా స్పందన లేదన్నారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఇంజినీరింగ్ విభాగం ఔట్ సోర్సింగ్ కార్మికులకు టెక్నికల్ జీతం కింద నెలకు రూ.29,200, నాన్ టెక్నికల్ కింద రూ.24,500 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. హెచ్‌ఆర్ పాలసీ, ఔట్ సోర్సింగ్ కార్మికులకు రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్ కింద రూ.10 లక్షలు, రూ.10 ఫించన్, కారుణ్య నియామకాలు, మెడికల్ లీవులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అన్ని ప్రజా సంఘాలతో కలిసి సమ్మెను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సమాచార హక్కుల వేదిక నాయకులు చిన్నా, కిరణ్, కార్మిక నాయకులు మణిగండన్, సురేష్, చంద్రశేఖర్, భారతి, కోమళి, సుభాషిణి, మునికృష్ణ, మణికంఠన్, ఈశ్వర్ పాల్గొన్నారు.

తిరుమలకుప్పంలో ఆక్రమణలు ఆపండి


తిరుమలకుప్పం గుట్టను చదును చేస్తున్న ఆక్రమణదారులు

పుత్తూరు: మండల పరిధిలోని తిరుమలకుప్పంలో జరుగుతున్న ఆక్రమణలను వెంటనే ఆపాలని, అవినీతికి పాల్పడిన వీఆర్వో దామోదర్‌పై చర్యలు తీసుకోవాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు. ఈ మేరకు బుధవారం ది పబ్లిక్ గ్రీవెన్స్ వలంటరీ ఆర్గనైజేషన్ జనరల్ సెక్రెటరీ బి.గంగాధర్ ఆధ్వర్యంలో గ్రామస్తులు స్థానిక తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు ఫొటోలతో పాటు వినతిపత్రం అందజేశారు. గ్రామస్తుడు మహేశ్వరరావు మాట్లాడుతూ తిరుమలకుప్పం గ్రామ లెక్క దాఖలా సర్వే నెంబర్ 385లోని గుట్ట ప్రాంతంలో కొందరు వ్యక్తులు గత కొద్ది రోజులుగా జేసీబీలతో చదును చేస్తున్నారని తెలిపారు. ఇదే విషయాన్ని వీఆర్వో గంగాధర్‌కు చెప్పినా పట్టించుకోలేదని ఆరోపించారు. యథేచ్ఛగా ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, జేసీబీలను సీజ్ చేయాలని, వీఆర్వోపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ప్రమాదకరంగా బావి


జాతీయ రహదారి పక్కనే ఉన్న బావి

పాలసముద్రం: మండలంలోని రాచపాల్యం గ్రామం సమీపంలో బలిజకండ్రిగ–చిత్తూరు జాతీయ రహదాని పక్కన ఉన్న ఓ బావి ప్రమాదకరంగా ఉంది. నిత్యం ఈ రోడ్డులో బస్సులు, వాహనాలతో పాటు ప్రభుత్వ కళాశాలకు, స్కూళ్లకు వెళ్లే విద్యార్థులు కూడా ఈ దారిలోనే వెళ్తారు. ప్రహరీ లేకపోవడంతో బావి ఉన్న విషయం దగ్గరకు వెళ్తే గానీ తెలియదు. అదుపు తప్పితే వాహనాలు బావిలో పడే అవకాశం ఉంది. రాచపాల్యం గ్రామస్తులు ఆర్‌అండ్‌బీ అధికారులకు బావిని పూడ్చాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బావి ఉన్న చోట రోడ్డుకు ప్రహరీ నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సేంద్రియ వ్యవసాయం శ్రేయస్కరం

ఐరాల: వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలంటే సేంద్రియ ఎరువులే శ్రేయస్కరమని మండల ఏపీసీఎన్ఎఫ్ భారతి సూచించారు. మండలంలోని మద్దిపట్లపల్లె రైతు సేవా కేంద్రంలో బుధవారం స్థానిక రైతులకు పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో ఎరువుల ఎంపిక అత్యంత ప్రాధాన్యం కలిగి ఉందన్నారు. సాగుకు ముందుగా మట్టి పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా మంచి ఎరువులను ఎంచుకోవాలన్నారు. భూసారానికి హాని కలిగించే రసాయన ఎరువుల మోతాదును తగ్గించి పచ్చిరొట్ట ఎరువులు, జీవన ఎరువులు వంటి సేంద్రియ ఎరువులను అధికంగా వినియోగించాలన్నారు. రైతులు సస్యరక్షణకు డ్రోన్లను ఉపయోగించటం ద్వారా తక్కువ సమయం, ఖర్చుతో సమర్థవంతంగా పురుగు మందులను పిచికారీ చేయవచ్చని తెలిపారు. ఆధునిక సాంకేతికతను వినియోగించటంలో రైతులు ముందంజలో ఉండాలని ఆమె కోరారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థుల వితరణ


పుస్తకాలు, పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో ఎంఈవో, ఉపాధ్యాయులు

నగరి: విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలకు తమవంతు సహకారం అందించాలని, అక్కడ చదివే విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలని భావించిన పూర్వ విద్యార్థి లోకేష్ అతని సహచరులు ముందుకువచ్చారు. గుండ్రాజుకుప్పంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బుధవారం విచ్చేసిన వారు ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, జామెంటరీ బాక్స్‌లను ఎంఈవో శ్రీదేవి ద్వారా అందించారు. 2024–25లో పదవ తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ప్రియదర్శిని, ప్రీతం సాయి, షాలినికి రూ.2000, రూ.1500, రూ.1000 చొప్పున నగదు పురస్కారాలు అందించారు. దాతలను ఎంఈవో అభినందించారు. దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ప్రధానోపాధ్యాయిని నీరజారాణి, ఉపాధ్యాయులు జయానంద్, చంద్రయ్య, జయపాల్, నారాయణ నాగభూషణం, మోక్షదాయిని, తిరుమలరాజు, సుహాసిని పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ ఒక చీకటి అధ్యాయం



పుత్తూరు, నగరి సమావేశాల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి, వైస్ ప్రిన్సిపల్ భాస్కర రాజు

పుత్తూరు: దేశంలో 1975లో విధించిన అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) ఒక చీకటి అధ్యాయమని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి తెలిపారు. కళాశాలలో బుధవారం సంవిధాన్ హత్యాదివస్ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఎమర్జెన్సీ కారణంగా ప్రజల పౌర హక్కులు రద్దయ్యాయని, పత్రికల పైనా నిషేధం విధించారని, బలవంతపు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయించారని, దేశ వ్యాప్తంగా లక్షా 50 వేల మంది విపక్ష నాయకులను జైల్లో పెట్టారని వివరించారు. అవి ప్రజాస్వామ్య దేశానికి చీకటి రోజులన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, ఎన్ఎస్ఎస్ అధికారులు శ్రీనివాసులు, బాబురావు, అధ్యాపకులు సుజన, సావిత్రి, దేవకి, కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితికి 50 ఏళ్లు


నగరి: వ్యక్తి స్వార్థం కోసం దేశంలో అత్యవసర పరిస్థితి విధించి నేటికి 50 ఏళ్లు అయినట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డా.భాస్కర రాజు తెలియజేశారు. కళాశాలలో 'సంవిధాన్ హత్య దివస్' కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంతర్గత కల్లోలం పేరుతో జాతీయ అత్యవసర పరిస్థితిని విధించి ప్రజాస్వామ్యం స్థానంలో నిరంకుశత్వం రాజ్యమేలిందని తెలిపారు. ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాయడంతో పాటు పత్రికా స్వేచ్ఛను హరించి భారత ప్రజాస్వామ్యంలో చీకటి కాలంగా మార్చా రని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యూ కో–ఆర్డినేటర్ ఇందిరా ప్రియదర్శిని, అర్థశాస్త్ర విభాగాధిపతి డా.రామాంజులు, రాజనీతి శాస్త్ర అధ్యాపకులు కుమారి, జేకేసీ మెంటార్ లాల్ బాషా పాల్గొన్నారు.


సదస్సుకు హాజరైన అధ్యాపకులు, విద్యార్థులు

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

- దోమల వ్యాప్తితో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం
- వాతావరణ మార్పులతో వ్యాధుల భయం
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యులు


సీజనల్ జ్వరాలతో ప్రభుత్వ ఆస్పత్రికి తరలివచ్చిన ప్రజలు (ఫైల్)



విజయపురం: వర్షాకాలం ప్రారంభం కావడంతో వాతావరణంలో మార్పులతో పాటు సీజనల్ వ్యాధులూ ముప్పేట దాడి చేస్తాయి. ఇటీవల వారం రోజులుగా అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. వీధుల్లో ఉండే మురుగు నీరు కారణంగా దోమలు వృద్ధి చెంది సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతాయి. ఇళ్లలో సైతం తగిన జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఇంటి పరిసరాల్లో శుభ్రత పాటిస్తే వ్యాధులను కట్టడి చేయవచ్చు. వ్యాధుల బారిన పడితే పక్కనే ఉన్న వైద్యుల సలహా తప్పనిసరిగా తీసుకుంటే మంచిందంటున్నారు వైద్యులు.

వ్యాధులు పెరిగే అవకాశం ఎక్కువ

ప్రస్తుతం వారం రోజులుగా చిరు జల్లులతోపాటు మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. వర్షపు నీరు ఇళ్ల చుట్టూ అక్కడక్కడ నిలిచి దోమలకు నిలయంగా మారింది. ఫలితంగా గ్రామాల్లో ప్రజలు జలుబు, జ్వరాల బారిన పడుతున్నారు. విస్తారంగా వర్షాలు కురిస్తే జలుబు, జ్వరం, దగ్గుతో పాటు డెంగీ, మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. వీటికి సంబంధించిన లక్షణాలు కనిపిస్తే సమీపంలో ఉన్న వైద్యశాలలో సంప్రదించాలని వైద్యులు కోరుతున్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వైద్యుల సలహా తీసుకోవాలి.

తగిన జాగ్రత్తలు పాటించాలి

ప్రస్తుతం గ్రామాల్లో వర్షాలు పడుతున్నాయి. ప్రజలందరూ తగిన జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య సిబ్బంది కూడా అప్రమత్తంగా ఉండి సమస్యలు వ్యాధి లక్షణాలు ఉండే వైద్యుల వద్దకు వెళ్లాలి. జలుబు, జ్వరం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

–డాక్టర్ విష్ణుప్రియ, విజయపురం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- ఆహారం, నీరు కలుషితం కాకుండా చూసుకోవాలి. మల, మూత్ర విసర్జన అనంతరం చేతులను శుభ్రం చేసుకోవాలి.
- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- చిన్న పిల్లలకు ఒంటి నిండా దుస్తులు కప్పి ఉంచేలా చర్యలు తీసుకోవాలి.
- పండ్లు, కూరగాయలను శుభ్రంగా కడిగిన తర్వాతనే తినాలి.
- ఇంటి పరిసరాల్లో పాత టైర్లు, డ్రమ్ములు, వినియోగించిన కొబ్బరిబోండాలు ఉంచకూడదు.
- నిల్వ ఉన్న నీటిని బయట పారపోయాలి.
- పేడదిబ్బలు గ్రామ సమీపంలో లేకుండా చూడాలి.
- వేడి చేసి చల్లార్చిన నీటిని తీసుకోవాలి.
- రాత్రి పూట నిద్రించే సమయంలో దోమ తెరలు వాడాలి.